క్లుప్తంగా

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



ఘంటసాల: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో ఏపీ కౌలు రైతుల సంఘం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఘంటసాల బ్యాంకు సెంటర్ నుంచి ప్రధాన సెంటర్ మీదుగా విరాళాలు సేకరణ చేపట్టారు. ప్రజాప్రతినిధులు, వివిధ షాపుల నిర్వాహకులు తమ వంతు సహకారం అందించారు. రూ.12,001 సేకరించామన్నారు. వివిధ సంఘాల నేతలు మిక్కిలినేని మధు, వేమూరి ప్రవీణ్, పంచకర్ల రంగారావు, యద్దనపూడి మధు, మేడంకి వెంకటేశ్వరరావు, మహమ్మద్ కరీముల్లా, బలె రమేష్ పాల్గొన్నారు.

నాన్న స్నేహితులు కలవడం సంతోషకరం



పెడన: దివంగత మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావుతో పాటు పెడనలోని భట్ట జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర సంఘటనలు చోటు చేసుకున్నాయి. కృష్ణప్రసాద్ తండ్రి కాగిత వెంకట్రావు క్లాస్‌మేట్స్ అని కలిసిన వారు చెప్పడంతో ఎమ్మెల్యే చాలా సంతోషం వ్యక్తం చేశారు. నాన్న స్నేహితులైన మీరు నన్ను కలవడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీహెచ్ అల్లూరయ్య, నందం మహేష్, మాదాసు బాబురావు, వనకృష్ణ నరస్సయ్య, వార్త చినమహేష్ ఉన్నారు.

దివిసీమలో నిలకడగా వరద



అవనిగడ్డ: దివిసీమలో వరద నిలకడగా ఉంది. శుక్రవారంతో పోలిస్తే శనివారం కొద్దిగా వరద తగ్గింది. వరద ఉధృతికి కాజ్‌వే రహదారి కొట్టుకుపోయిన పాత ఎడ్లంకలో గ్రామస్తులు పడవపైనే ప్రయాణాలు సాగిస్తున్నారు. పులిగడ్డ అక్విడెక్టు వద్ద వరద నిండుగా ప్రవహిస్తోంది. వరదను చూసేందుకు ప్రజలు తరలివస్తున్నారు. త్వరలో వరద తగ్గుముఖం పడుతుందని ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ చెప్పారు. వరద తగ్గుముఖం పట్టడంతో కరకట్ట కింద ఉన్న పొలాల రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పాదయాత్రగా తిరుమలకు పయనం



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి పరిధిలోని రావివారిపాలెంకు చెందిన యువ న్యాయవాది రావి సతీష్ గ్రామం నుంచి పాదయాత్రగా తిరుమల తిరుపతి దేవస్థానానికి శనివారం బయలు దేరారు. ఉదయం ఏడు గ్రామాల్లో జోగి తిరిగి భక్తుల ఆశీర్వచనాలు అందుకున్నారు. సాయంత్రం రావివారిపాలెం నుంచి రేపల్లె చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేపల్లె మీదుగా బాపట్ల, చీరాల, ఒంగోలు, చిత్తూరుకు ప్రతి రోజూ 20 కిలోమీటర్ల చొప్పున సుమారు 400 కిలోమీటర్లు ప్రయాణించి వెంకటేశ్వరస్వామివారి సన్నిధికి చేరుకుంటానని తెలిపారు. వీరి ప్రయాణం సజావుగా సాగాలని స్థానిక జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, మోపిదేవి జెడ్పీపాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి కావూరి కోదండరామయ్య, ప్రముఖ దంతవైద్యుడు డాక్టర్ రావి శ్రీనివాసరావు, పలువురు గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

బంటుమిల్లి: మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గణేష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం బాధ్యతలు తీసుకున్న ఆయన శనివారం పలు చోట్ల దాడులు చేసి బెల్టుషాపు నిర్వాహకులపైన, పేకాడుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా బంటుమిల్లి గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకురాలు బొల్లా దుర్గామల్లేశ్వరిని అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే కంచడం గ్రామంలో పేకాట శిబిరంపై చేసిన దాడిలో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,400 స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ మూకల దుశ్చర్యపై పెల్లుబికిన నిరసన

- మహాశిల్పం శిలాఫలకంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయండి
- వైఎస్సార్ సీపీ నేతలు ఉప్పాల రాము, సింహాద్రి వెంకటేశ్వరరావు
- పెడన, అవనిగడ్డలో కొవ్వొత్తులతో నిరసన



పెడనలో అంబేద్కర్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న రాము తదితరులు



సీతాయిలంకలో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పెడన: విజయవాడ స్వరాజ్య మైదానంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ మూకలు చేసిన దుశ్చర్యకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సామాజిక న్యాయం కోసం రూ.400 కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనాన్ని సుందరంగా నిర్మించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని, అటువంటి ఆయన పేరు తొలగించడం చాలా హేయమైన చర్యని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రమేష్(రాము)అన్నారు. విజయవాడలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఫలకంపై పచ్చమూకల దాడికి నిరసనగా పెడన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం క్షీరాభిషేకం నిర్వహించారు. కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు.

పోలీసులు చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం

ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. విజయవాడ నడిబొడ్డున ఉన్న సామాజిక న్యాయ స్మృతివనాన్ని ధ్వంసం చేయడానికి వచ్చిన వారు రేపు అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా ధ్వంసం చేస్తారని, అటువంటి వారిని ఉపేక్షించకుండా తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాడులు చేసి మూడు రోజులవుతున్నా పోలీసులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దాడులకు పాల్పడిన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు గరికిముక్కు చంద్రబాబు, బొడ్డు శ్యామలాదేవి, నవీన్, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నింటి మహేష్, గూడూరు, బంటుమిల్లి ఎంపీపీలు మధుసూదనరావు, చినబాబు, పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరావు, నాగబాబు, సుజ్ఞానం మహేష్, అచ్యుతరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు శిరివెళ్ల జయేష్, పిచ్చుక సతీష్‌బాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహానికి రక్షణ కల్పించాలి..

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సీతాయిలంక అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదేశాల మేరకు పంచాయతీ పరిధిలోని సీతాయిలంక అంబేద్కర్ విగ్రహం ముందు శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ నేతలు కొవ్వొత్తులు ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. భారత్ దేశం యావత్తు గర్వించే విధంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహం వద్ద టీడీపీ గూండాలు సృష్టించిన బీభత్సం రాష్ట్ర ప్రజలు తలదించుకునేలా చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రారంభోత్సవం చేసిన ఈ విగ్రహం వద్ద ఆయన పేరును తొలగించడం దారుణమన్నారు. విజయవాడ నడిబొడ్డున జరిగిన ఈ ఘటన రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందనడానికి నిదర్శనమన్నారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు దీనిపై సీబీఐ దర్యాప్తు చేయించి వెనుకుండి నడిపించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయకుమార్ మాట్లాడుతూ తొలగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరును తిరిగి ఏర్పాటు చేయడంతో పాటు అంబేడ్కర్ విగ్రహానికి ప్రత్యేక రక్షణ కల్పించాలన్నారు. తొలుత నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఎంపీటీసీ తోట గణేష్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ బాషా, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు గొరుముచ్చు రమేష్, మునిపల్లి వెంకటేశ్వరరావు, మేడికొండ సంతోషరావు, పార్టీ యూత్ మండల కన్వీనర్ చింతలపూడి బాలు, బీసీ సెల్ నాయకులు కోలా హరి, పాలెపు లీలాకర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



పెడన: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియన్ క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత ఆ సంఘ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని తాము చేస్తున్న డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీఎఫ్ కార్యదర్శి రెవరెండ్ డానియల్, రెవరెండ్ డాక్టర్ పి.దేవదానం, జక్కుల ఆనంద్, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల ఇన్‌చార్జి రెవరెండ్ టి.ఇమ్మానీయులు, ఆల్ ఇండియా పూర్ పీపుల్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బూదాల ఆశీర్వాదం, బత్తుల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పులిగడ్డలో పేకాట శిబిరంపై దాడి

పులిగడ్డ(అవనిగడ్డ): మండల పరిధిలోని పులిగడ్డలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,080 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉదయం బాసు శ్రీనివాసరావు, మానుకొండ లీలాకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు యువనేత మండలి వెంకట్రామ్(రాజా) పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సాహిత్య రంగంలో ఆణిముత్యం 'ముదిగొండ'



సభలో మాట్లాడుతున్న రావి రంగారావు

మచిలీపట్నంటౌన్: ముదిగొండ సీతారావమ్మ మరణం సాహిత్య రంగానికి తీరనిలోటని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు రావి రంగారావు అన్నారు. స్థానిక వివేకానంద మందిరంలో ముదిగొండ సీతారావమ్మ సంతాప సభను శనివారం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ.. ముదిగొండ సీతారావమ్మ 10 ఏళ్ల సాహితీమిత్రులు సంస్థకు కోశాధికారిగా సేవలు అందించారని, ఆమె తన రచనల్లో సమాజానికి ఉపయోగపడే విషయాలపై రాసిన కవితలు ప్రజలను చైతన్యవంతం చేశాయన్నారు. శతావధానం, అష్టావధానంలో ముదిగొండ తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకున్నారని కొనియాడారు. గుడివాడ సాహితీమిత్రులు సంస్థ అధ్యక్షుడు వసుధ బసవేశ్వర మాట్లాడుతూ.. జిల్లా సాహిత్యరంగంలో ముదిగొండ తనకంటూ ఓ పేజీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కారుమూరి రాజేంద్రప్రసాద్, భవిష్య, బాలాజీ, ముదిగొండ శాస్త్రి, ముదిగొండ ఫణి దూర్జటి, జొన్నల వెంకటనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు హేయం

మచిలీపట్నంటౌన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు తెలపటం అత్యంత హేయనీయమని ఉమ్మడి కృష్ణాజిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముస్లింలకు ఇబ్బంది కలిగే ఈ బిల్లును సమర్థిస్తూ టీడీపీ మద్దతు తెలపటంపై ఆ పార్టీలోని ముస్లింలు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. బిల్లుకు మద్దతును టీడీపీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లింల అభ్యున్నతికి మాజీ సీఎంలు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రస్తుతం ఈ బిల్లును కూడా పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ వ్యతిరేకించిందన్నారు. ఈ బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఇనుగుదురుపేట కబేళా రోడ్డులో ఉన్న హజరత్ మీర్ హుస్సేన్ అలీషా ఖాదరీ ఉరుసు మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ఆ రోజు రాత్రి ఖాదరీ దర్గా వద్ద గంధం సమర్పించారు. శనివారం రాత్రి దీపారాధన చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ 28వ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్, టీడీపీ నగర అధ్యక్షుడు ఇలియాస్‌పాషా, దర్గా కమిటీ సభ్యులు షేక్ అలీ, ఇలియాస్, సల్మాన్, అమీర్, మున్నా, సాబీర్, ఇనాయత్ తదితరులు దర్గాలో చాదర్‌ను సమర్పించారు. ఆదివారం మధ్యాహ్నం దర్గా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



నాగాయలంక(అవనిగడ్డ): యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం కార్యాలయం వద్ద నాయకులు యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీజీ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ కృషి చేస్తూ అవిరళ పోరాటం సాగిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు తెనాలి శ్రీనుబాబు, నాయకులు బి.సాంబశివరావు, ఎస్.సురేష్ బాబు, యు.శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు, బి.హనుమాన్, ఎం.శ్రీను, కె.వి.శేషారావు, డి.రామకృష్ణ పాల్గొన్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపు..!

- ఊపిరితిత్తులు దెబ్బతినడంతో మంచానికే పరిమితం
- రూ.40 లక్షలు ఖర్చు అవుతాయంటున్న వైద్యులు



ఊపిరితిత్తులు దెబ్బతినడంతో మంచానికే పరిమితమైన మణికంఠ

కోడూరు: కుటుంబ పోషణ కోసం ఎంచుకున్న వృత్తే తన ప్రాణాల మీదకు తీసుకువచ్చింది. చిన్న వయసు నుంచే కుటుంబం కోసం శ్రమించిన ఆ యువకుడు ప్రస్తుతం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. కోడూరులోని వడ్డెరపాలెంకు చెందిన 27 ఏళ్ల బంద్రారు మణికంఠ కుటుంబపోషణ కోసం 18 సంవత్సరాల వయసులో విజయవాడ వెళ్లి అక్కడ అద్దాల ఫిన్నింగ్ పనిలో చేరాడు. అక్కడ ఫిన్షింగ్ పనులు చేస్తూ వచ్చిన రూపాయి తన ఖర్చులకు వినియోగించుకొని మిలిగినవి ఇంటి అవసరాల కోసం పంపించాడు. ఈ నేపథ్యంలో మణికంఠ వివాహం చేసుకోగా, ప్రస్తుతం ఇద్దరు సంతానం ఉన్నారు. పని చేసే సమయంలో అద్దాలపై ఉంచే పౌడర్ ముక్కు, నోరు ద్వారా మణికంఠ శరీరంలోకి ప్రవేశించింది. దగ్గు తీవ్రంగా వస్తుండడంతో పెదఅవుటపల్లి సిద్ధార్థ ఆస్పత్రిలో పరీక్షలు చేసి రెండు ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని చెప్పారన్నారు.

సాయం అందించాలని వేడుకోలు..

ఈ నేపథ్యంలో మణికంఠకు వైద్యం చేయించేందుకు తండ్రి సుబ్బారావు తనకున్న ఇంటిని, ఇళ్ల స్థలాన్ని తనఖా పెట్టారు. భార్య శిరీష తాను తీసుకువచ్చిన కట్నం, బంగారాన్ని మణికంఠ వైద్య ఖర్చులకే ఉపయోగించారు. ఊపిరితిత్తుల మార్పిడికి రూ.40 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని, ప్రస్తుతం తమ దగ్గర అంత స్థోమత లేదని మణికంఠ భార్య శిరీష వాపోయింది. ప్రభుత్వం, దాతలు స్పందించి సహాయం అందించాలని కోరుతుంది. సహాయం చేసే దాతలు ఫోన్ పే నంబర్ 96404 93227 లేదా అకౌంట్ నంబర్ : 38078873486, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ–2 టౌన్ బ్రాంచ్‌కు నగదును పంపాలని బాధిత కుటుంబం కోరుతుంది.

గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



ఘంటసాలలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ మారుతీ శేషమాంబ



సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్



సర్పంచ్‌లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

ఘంటసాల: గ్రామ పంచాయతీలను సర్పంచ్‌లు, కార్యదర్శులు ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఘంటసాల ఎంపీడీఓ బి.మారుతీ శేషమాంబ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 22 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అధికారాలు, బాధ్యతలు, జీపీడీపీ నిధులు, సాధారణ పరిపాలన, పారిశుద్ధ్యం, తాగునీరు, ఎల్ఈడీ లైట్లు, చెత్త నుంచి సంపద కేంద్రాలు, వర్మీ కంపోస్టు నిర్వహణ, ప్లాస్టిక్ వాడకం, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, తదితర అంశాలపై శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అనంతరం శిక్షణ ముగించుకున్న సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఓ కేజే శ్రీనివాస చంద్, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ గుత్తికొండ కిషోర్, ఎస్.శ్రీలక్ష్మి, సీహెచ్ నాగమణి, పంచాయతీ, సచివాలయ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సర్పంచ్‌లు, కార్యదర్శుల శిక్షణ తరగతులు

ఈఓపీఆర్డీ రాజేశ్వరి పర్యవేక్షణలో..

గూడూరు: రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ రిఫ్రెషర్ ట్రైనింగ్‌లో భాగంగా గూడూరు మండలంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్లుగా లోయ శివనాగేశ్వరరావు, రాజశేఖర్‌లు వ్యవహరించారు. ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి పర్యవేక్షణలో శిక్షణ తరగతులు జరిగాయి.

పరిపాలనా వ్యవహారాలపై అవగాహన

కృత్తివెన్ను: పరిపాలనా వ్యవహారాలపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయని ఎంపీడీఓ రామకృష్ణరాజు తెలిపారు. గ్రామ స్థాయిలో చేయదగిన పనులు, వాటి నిర్వహణ, ఖర్చులు, ఆదాయ మార్గాలు తదితర అంశాలతో పాటు పరిపాలనా వ్యవహారాలను వివరించారు. శిక్షణలో సర్పంచ్‌లతో పాటు పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శుల సమన్వయం అవసరం

బంటుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌ల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, నిధులు, విధులు వినియోగం, చెత్త నుంచి సంపద సృష్టించడం తదితర అంశాలపై సీఆర్పీలు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ రామకృష్ణరాజు మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులు, సర్పంచ్‌ల సమన్వయం అవసరమన్నారు. అప్పుడే ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులు సద్వినియోగం అవుతాయని చెప్పారు. అనంతరం శిక్షణ తరగతుల్లో పాల్గొన్న వారికి ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. పలువురు సర్పంచ్‌ల భర్తలు పాల్గొని శిక్షణ తరగతుల సర్టిఫికెట్లు అందుకోవడం విశేషం.

ఎస్సీ బాలికల వసతిగృహానికి ఇన్వెర్టర్ అందజేత



ఇన్వెర్టర్ అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నాగభూషణం తదితరులు

అవనిగడ్డ: కోడూరు మండలం ఉల్లిపాలెం ఎంపీయూపీ స్కూల్ పూర్వ విద్యార్థి నర్రా పవన్‌చంద్ ఆర్థిక సహాయంతో మోపిదేవి ఎస్సీ బాలికల వసతి గృహానికి ఇన్వెర్టర్ బహూకరించారు. ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులచే నేను సైతం అనే వాట్సాప్ గ్రూపు నిర్వహిస్తున్నారు. ఈ గ్రూపులోని పూర్వ విద్యార్థి పవన్‌చంద్ రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించగా, వాటితో నాగభూషణం ఇన్వెర్టర్ కొనుగోలు చేసి శనివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా వసతి గృహ వెల్ఫేర్ ఆఫీసర్ యాసం శివనాగలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగభూషణం మాస్టారు అందజేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కోడూరు ఎంఈఓ రాందాస్, జనసేన అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ కటికల వసంత్, మాజీ ఎంపీటీసీ చిలకా శ్రీనిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు




బంటుమిల్లిలో జేసీబీతో తొలగిస్తున్న పిచ్చి మొక్కలు

బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి – పెదతుమ్మిడి ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్‌లోని కంప చెట్లను తొలగించే పనులను ఆర్అండ్‌బీ అధికారులు శనివారం నుంచి చేపట్టారు. జయపురం గ్రామం నుంచి దాదాపు పెదతుమ్మిడి గ్రామ శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లో కంప చెట్లు వాహనదారులను, పాదచారులను ఇబ్బందులు పెడుతున్నాయి. ఈ సందర్భంగా జేఈఈ కిషోర్ మాట్లాడుతూ ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టామన్నారు. అయితే జేసీబీ ద్వారా తొలగించిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను సమీపంలోని డ్రెయిన్‌లో వేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జేఈఈ మాట్లాడుతూ డ్రెయిన్‌లో వేసిన అడ్డంకులు తొలగించి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

కొత్తపేటలో పిచ్చిమొక్కల తొలగింపు

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేట – అవనిగడ్డ ప్రధాన రహదారి పక్కనున్న ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలను జేసీబీతో తొలగించారు. కొత్తపేటకు చెందిన జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, జనసేన యువనాయకుడు మండలి వెంకట్రామ్(రాజా) ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ కన్వీనర్ గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ బొప్పన భాను, అడపా ప్రభాకర్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి



బంటుమిల్లి: నియోజకవర్గ పరిధిలోని ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్(కేపీ) అన్నారు. రోటరీ క్లబ్ మచిలీపట్నం ఆధ్వర్యంలో యానాది కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన యానాది దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీలకు ఆధార్ కార్డులు, ఇంటి స్థలాలు, పక్కా గృహాల నిర్మాణంతో పాటు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామ శివారుగా ఉండే ఎస్టీ కాలనీలకు తాగునీరు అందచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి వైద్యులు సుబ్రహ్మణ్యం, శాంతి వైద్య పరీక్షలు చేయడంతో పాటు అనారోగ్య సమస్యలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సునీత, నాయకులు బి.కాశీ, కె.శ్రీనివాసరావు బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ఎస్టీలు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ దంపతులు ఎమ్మెల్యే కాగితను సత్కరించారు.